సుపరిపాలనకు హ్యాట్సాఫ్

- జగనన్న ఇంటింటి రేషన్ విధానానికి జనం ఫిదా
- ఉపాధి కోల్పోయే బాధ తప్పిందని చిరుద్యోగులు, రోజువారీ కూలీల హర్షం

వినూత్న రీతిలో పథకాలు అందిస్తూ.. సంక్షేమం చేరువ చేస్తూ సీఎం జగన్ సుపరిపాలన అందిస్తున్నారు. గతంలో రేషన్ సరుకుల కోసం పడిగాపులు పడేవాళ్లమని.. జగనన్న ఆ విధానానికి చెక్ పెట్టి.. దేశంలో ఎక్కడా లేని విధంగా లబ్ధిదారుల ఇళ్ల ముందుకు నేరుగా వాహనం వచ్చి రేషన్ సరుకులు ఇచ్చే విధానాన్ని తీసుకొచ్చి దేశంలోనే ఆదర్శంగా నిలిచారని ప్రజలు కొనియాడుతున్నారు. ఈ విధానం వల్ల తమ పనీ పాటలకు ఇబ్బంది లేకుండా రేషన్ పొందగలుగుతున్నామని హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జగదాంబ : గతంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందజేసే రేషన్ సరుకులు తీసుకోవాలంటే అదొక ప్రవాసనంలా ఉండేది. ఎక్కడో ఉన్న రేషన్ దుకాణానికి వెళ్లి.. చాంతాడంత క్యూలో నిలబడి రేషన్ సరుకులు తీసుకోవాల్సి వచ్చేది. దీని కోసం ఒకపూట పని మానుకోక తప్పేది కాదు. దీనివల్ల రోజువారీ కూలీలు, చిరుద్యోగులు ఉపాధి కోల్పోయేవారు. ముసలీ, ముతకా అయితే నిలబడలేక సొమ్మసిల్లి పడిపోయిన దాఖలాలు కూడా ఉండేవి. పోనీ తర్వాత తీసుకుందామని వెళితే మళ్లీ వెళ్లినప్పుడు రేషన్ సరుకులు దొరికేవి కావు. అయిపోయాయని డీలర్ తాపీగా చెప్పేవాడు.

రేషన్ కార్డులు.. సరఫరా వాహనాలు ఇలా..

జీవీఎంసీ 35వ వార్డులో మొత్తం రేషన్ కార్డులు	8,200
అంత్యోదయ అన్న యోజన కార్డులు	200
హౌస్‌హోల్డ్ రేషన్ కార్డులు	8,000
రేషన్ సరఫరా చేసే వాహనాలు	6


పండా వీధిలో రేషన్ తీసుకుంటున్న స్థానికులు (ఫైల్)

అంతే కాదు అప్పట్లో చాలా చోట్ల రేషన్ సరుకుల తూకంలో మోసాలు జరిగి, సరుకులు తక్కువగా వస్తున్నట్లు కూడా ఫిర్యాదులు వెల్లువెత్తేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అటువంటి కష్టాలకు చెక్ పడింది. నేరుగా లబ్ధిదారుల ఇళ్ల మధ్యకొచ్చి రేషన్ అందజేసే సరికొత్త విధానాన్ని సీఎం జగన్ మొదలుపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారు. రేషన్ సరుకుల కోసం ఎండా–వానల్లో లైన్‌లో నిలబడకుండా చెంతకొచ్చి సరుకులు అందజేస్తున్నారు. దీని కోసం సీఎం జగన్ ప్రత్యేకంగా రేషన్ వాహనాలు అందుబాటులోకి తీసుకొచ్చి సంక్షేమం అంటే ఇదీ అని చాటి చెప్పారు.

సమాచారం కూడా అందిస్తున్నారు



ఇంటి ముంగిటకు రేషన్ ఇవ్వడానికి వాహనం వచ్చే సరికి వలంటీర్లు వచ్చి ఆ విషయం చెబుతున్నారు. దీంతో ఏ పనిలో ఉన్నా ఆపేసి వెళ్లి రేషన్ తీసుకుంటున్నాం. ఇప్పుడు తూకంలో మోసం లేకుండా రేషన్ తీసుకోగలుగుతున్నాం.

–రామాయమ్మ, 35వ వార్డు, పండావీధి

బాధలు తొలగించారు



గతంలో రేషన్‌కు వెళ్తే డీలర్లు ఉండే వారు కాదు. అలాగని తర్వాత వెళ్తే రేషన్ అయిపోయిందనేవారు. దీని వలన ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు జగనన్న ఆ బాధలు లేకుండా చేశారు. నేరుగా ప్రజల మధ్యకు వచ్చి సైరన్ మోగించి మరీ రేషన్ ఇచ్చే పద్ధతి మన రాష్ట్రంలోనే ఉంది.

– వరలక్ష్మి, దుర్గమాంబ సమాజం, 35వ వార్డు

రేషన్ పంపిణీతో ఉపాధి..



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగులైన మాకు పని కల్పించారు. వీధుల్లోకి మా వాహనం వస్తే చాలు అందరూ రేషన్ తీసుకుంటున్నారు. ఏ ఒక్కరు ఉండిపోయినా వలంటీర్ వెళ్లి పిలుచుకొస్తున్నారు.

– రమేష్, రేషన్ వాహనం డ్రైవర్

సుప్రీం తీర్పును ఆహ్వానిస్తున్నాం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కత్తి పద్మ

అల్లిపురం : బిల్కిస్ బానో కేసులో సుప్రీం తీర్పును ఆహ్వానిస్తున్నామని మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కత్తి పద్మ అన్నారు. వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బిల్కిస్ బానో నిందితుల విడుదలను ఛాలెంజ్ చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు కాగా విచారణ చేపట్టిన కోర్టు ముద్దాయిలందరినీ లొంగిపోవాలని ఆదేశించిందన్నారు. ఈ తీర్పు గుజరాత్ ప్రభుత్వానికి గుణపాఠంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో హెచ్ఆర్ అనూరాధ, ముస్లిం థింకర్స్ ఫోరం ప్రతినిధి జహీరా, నాస్తిక సమాజం ప్రతినిధి రాంప్రభు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య ప్రతినిధి అన్నపూర్ణ, అడ్వకేట్ ఐఎం అహ్మద్ పాల్గొన్నారు.

తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

విశాఖ విద్య: సంక్రాంతి పండుగ సెలవుల్లో తరగతులు నిర్వహించే పాఠశాలలు, కాలేజీల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎస్సీపిసిఆర్) సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల ప్రైవేటు, కార్పొరేటు స్కూళ్లు ఈ నెల 9 నుండి 18 వరకు,అలాగే ఇంటర్మీడియట్ కళాశాలలు 11 నుండి 17 వ తేదీ వరకు విద్యార్థులకు సంక్రాంతి సెలవులు ఇవ్వాల్సిందేనన్నారు. ప్రభుత్వ ఆదేశాలు, కమిషన్ సూచనలు పాటించని స్కూళ్లు, కాలేజీల గుర్తింపు రద్దుతో పాటు క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు.

క్లుప్తంగా

సొంత నిధులతో పెన్షన్ అందజేత


లక్ష్మీకాంతానికి నగదు అందజేస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పోస్టాఫీసు వీధిలో నివసిస్తున్న గందవరపు లక్ష్మీ కాంతాని (74)కి సాంకేతిక కార్యణాలతో వృద్ధాప్య పింఛన్ రాకపోవడంతో మంగళవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జీసీఎస్ అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ సొంత నిధులతో రూ. 3 వేలు అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవ్వాతాతలకు పెంచిన పెన్షన్ ఇచ్చి అండగా నిలిచారని, రానున్న ఎన్నికల్లో ఆయనకి ఓటు వేసి రుణం తీర్చుకోవాలని కోరారు.

కళాశాలలో సంక్రాంతి సందడి


భోగి మంటలు వేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

సీతమ్మధార : ద్వారకానగర్‌లోని బీవీకే కళాశాలలో మంగళవారం ఘనంగా సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు ముగ్గులు వేసి గాలిపటాలు ఎగరేశారు. భోగి మంట వేశారు. మన సంప్రదాయాలు మరింత ఆదరణ పొందే విధంగా ఈ కార్యక్రమం నిర్వహించామని ప్రిన్సిపాల్ డీవీఎల్ఎన్ జోగిరాజు, ఉపాధ్యాయులు తెలిపారు. గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ వై.శ్రీధర్, కేఎస్ మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ


పాలు, గుడ్లు, బాలామృతం అందజేస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ చిరంజీవి, శ్రీహరిరెడ్డి

అల్లిపురం : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెలో ఉన్నందున బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు సచివాలయ కార్యదర్శుల ద్వారా మంగళవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. జీవీఎంసీ 33వ వార్డులోని కుమ్మరవీధి సచివాలయం ఆవరణలో గల అంగన్‌వాడీ కేంద్రం వద్ద వెల్ఫేర్ సెక్రటరీ చిరంజీవి సమక్షంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల శ్రీహరి రెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి తదితరులు పాల్గొని 11 మంది గర్భిణులు, 12 మంది బాలింతలు, 69 మంది చిన్నారులకు కిట్లు, బియ్యం, పాలు, నూనె, కందిపప్పు, గుడ్లు, బాలామృతం అందజేశారు.

'న్యాయవాదుల పోరాటంలో భాగస్వాములు కావాలి'

అల్లిపురం : ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేసేందుకు న్యాయవాదులు చేస్తున్న పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని సీనియర్ న్యాయవాది బెవర సత్యనారాయణ పిలుపునిచ్చారు. విశాఖ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయలేదన్నారు. ఇక్కడ మాత్రం అమలు చేస్తున్నారన్నారు. దీని వలన ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఈ సమావేశంలో విశాఖ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు లత, సీనియర్ న్యాయవాదులు బీవీ రామాంజనేయులు, యుఎస్ఎస్ఎన్ రాజు, ఐ.ఎం.అహ్మద్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 27వ రోజు మంగళవారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు.

అష్టదళ పద్మారాధన..

108 స్వర్ణపుష్పాలతో కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన జరిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో, త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2 వేల 500 మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ కమిషన్ ఏర్పాటుకు డిమాండ్


సమావేశానికి హాజరైన అతిథులు

అల్లిపురం : స్వయం ప్రతిపత్తి కలిగి జ్యుడీషియల్ స్థాయి గల హిందూ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో దీనిని చేర్చాలని హిందూ ధార్మిక పరిషత్ రాజకీయ పార్టీలను డిమాండ్‌చేసింది. ఈ మేరకు మంగళవారం హిందూ డిక్లరేషన్ సాధనకు ధార్మిక, సామాజిక ప్రముఖులు, ధార్మిక పరిషత్ ప్రతినిధులు, బ్రాహ్మణ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముందుగా కార్యక్రమాన్ని హిందూ ధార్మిక పరిషత్ సభ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ తదితరులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నెల్లిమర్ల దుర్గాపీఠం పీఠాధిపతి చిన్నస్వామి మాట్లాడుతూ హిందువుల సంప్రదాయాలను, ఆలయాలను పరిరక్షించే దిశగా హిందూ కమిషన్ ముందుకెళ్తుందన్నారు. 26వ తేదీన అన్ని రాజకీయ పార్టీలకు మెమొరాండం ఇస్తామన్నారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామ ప్రాణప్రతిష్ఠ చేసే సమయంలో రాష్ట్రంలో అన్ని దేవాలయాల ముందు హిందూ కమిషన్ ఏర్పాటు చేయాలని చట్టబద్ధంగా ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కె. లలిత్, రాగం కిషోర్, బాలాజీ, పీవీ నారాయణ, రాధాకృష్ణ, మాజీ శాసన సభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎంఎల్‌సీ పీవీఎన్ మాధవ్, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, పీవీ రామారావు, డాక్టర్ రమణమూర్తి, శ్రీనివాస్, సీహెచ్ వెంకటపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి


33వ వార్డులో సంతకాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు


27వ వార్డులో సంతకాలు సేకరిస్తున్న సర్వేశ్వరరెడ్డి

అల్లిపురం : విజయవాడ స్వరాజ్ మైదాన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ నిర్మాణం పూర్తి చేసుకుని ఈ నెల 19వ తేదీన ప్రారంభోత్సవానికి సన్నద్ధమవుతున్న నేపథ్యంలో 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పాల శ్రీహరిరెడ్డి, యల్లంకి చిన్నమ్మలు, పచ్చిరిపల్లి రాము, మాదాబత్తుల రమేష్, వెంకటేశ్వరమెట్ట సచివాలయం అడ్మిన్ భార్గవ్, కుమ్మరవీధి అడ్మిన్ రియాజ్, వెంకటేశ్వరమెట్ట –2 సచివాలయం ఇన్‌చార్జి కిరణ్, వలంటీర్లు తదితరులు విగ్రహావిష్కరణను కొనియాడారు. బృందావన్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని కాన్వాస్‌పై సంతకాలు చేశారు. దీనికి ముందు అంబేడ్కర్ చిత్రపటానికి వారంతా పూలమాల వేసి నివాళులు అర్పించారు.

27వ వార్డులో..

సీతమ్మధార : భారతరత్న బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం విజయవాడలో ఈనెల 19వ తేదీన సీఎం జగన్ ఆవిష్కరిస్తున్న సందర్భంగా 27వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో 'పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ'


అప్పన్న ఆలయంలో కమిటీ చైర్‌పర్సన్ జగదాంబిక పాల్, సభ్యులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ ఎనర్జీ బృందం దర్శించుకుంది. కమిటీ చైర్‌పర్సన్ జగదాంబిక పాల్, సభ్యులు కిసాన్ కపూర్, సునీల్ కుమార్ మోండల్, కేఆర్ఎన్.రాజేష్ కుమార్ స్వామిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద వీరికి పూర్ణ కుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వీరంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో భ్రమరాంబ అందజేశారు. సూపరింటిండెంట్ పిళ్లా శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన


లక్ష్మీటాకీస్ ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్


27వ వార్డులో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ : మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మీ టాకీస్ వద్ద ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పలువురి నుంచి ఆయన వినతులు స్వీకరించారు. జీవీఎంసీ 39వ వార్డు చిలకవీధి వద్ద టిడ్కో ఇళ్ల నిర్మాణం కోసం రహదారి మూసివేయడంతో నడక దారి లేక ఇబ్బంది పడుతున్నామనే ఫిర్యాదుతో వెంటనే ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడారు. పలువురు శిథిలమైన రోడ్లు, కాలువలు మరమ్మతు చేయాలని వినతిపత్రాలు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతుండగా నేరుగా తమ ఇళ్లకు ఎమ్మెల్యే వచ్చి సాయమందించడం సంతృప్తిని ఇచ్చిందని పలువురు వాసుపల్లిని కొనియాడారు. అనంతరం మండల ప్రెసిడెంట్, స్టేట్ ఫారెస్టు డైరెక్టర్ పీతల వాసు పుట్టినరోజు సందర్భంగా ప్రజాదర్బార్‌లో కేక్ కట్ చేసి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లి సింహాచలం, పార్టీ నాయకులు, గృహసారథులు, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల కోసం..

మహారాణిపేట : మత్స్యకారుల కోసం హార్బర్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఎఫ్‌డీవో ఆశాజ్యోతితో కలిసి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఈతగాళ్లకు జీతభత్యాలు అందజేయాలని కోరిన వెంటనే ఎఫ్‌డీవో ఆశాజ్యోతికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం నాలుగో జోన్‌కు సంబంధించి 35 మంది నూతన వలంటీర్లకు ఏపీడీ పుణ్యవతి సమక్షంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలు ముందుకు తీసుకెళ్లడంలో గృహసారథులు సైనికుల్లా పని చేయాలని కోరారు. ప్రజలకు పథకాలు అందించడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. ఈ సందర్భంగా వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మండల ప్రెసిడెంట్లు, వార్డు ప్రెసిడెంట్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, స్టేట్ డైరెక్టర్లు, ఆలయాల చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

27వ వార్డులో..

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలోని పరదేశమ్మ గుడి వద్ద ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరించి పలు సమస్యలు పరిష్కరించారు. మరికొన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు అధ్యక్షుడు, ఎరుకుమాంబ ఆలయం చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, మండల అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథలు, అధికారులు పాల్గొన్నారు.

14న సింహగిరిపై గోదా కల్యాణం

సింహాచలం : భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 14న సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో గోదా కల్యాణాన్ని విశేషంగా నిర్వహిస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4 గంటల నుంచి కల్యాణోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం జరిగే నిత్యకల్యాణం కూడా గోదా కల్యాణంతో కలిపి నిర్వహిస్తామని వెల్లడించారు. భక్తులంతా ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ నెల 15న మకర సంక్రాంతి పురస్కరించుకుని ఉత్తరాయణం పుణ్యకాలం పూజలు సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు దర్శనాలు ఉండవన్నారు. 16న కనుమ పురస్కరించుకుని కొండదిగువ పూలతోటలో గజేంద్రమోక్షం ఉత్సవం ఉంటుందన్నారు. ఆ రోజు సింహగిరిపై సాయంత్రం 4 గంటలకి స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని కొండ దిగువకి తీసుకెళ్తామన్నారు. గజేంద్రమోక్షం ఉత్సవం అనంతరం రాత్రి అడవివరం పుర వీధుల్లో స్వామిని గజవాహనంపై తిరువీధి నిర్వహిస్తామన్నారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున ఈ ఉత్సవంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మహిళలకు చీరల అందజేత


చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్


లక్ష్మీనగర్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, సింహాచలం

సీతమ్మధార : సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో చివరి శ్వాస వరకు పని చేసిన వాళ్లే నిజమైన నాయకులని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు జగనన్న ప్రజా సంకల్ప యాత్రకు ఐదేళ్లు పూర్తి అయిన సందర్భంగా 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో దొండపర్తిలో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జగనన్న నాయకత్వంలో పని చేయడం తమ అదృష్టమని, టికెట్టు రాలేదని పార్టీని వీడిన వారితో తమకి నష్టం లేదన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో 3678 కిలోమీటర్లు నడిచి ప్రజలు కష్టాలు తెలుసుకుని, వాటిని పరిష్కరించారని తెలిపారు. ఆయనను మరల సీఎంగా గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసిన ఘనత జగనన్నదే..

జగదాంబ : హామీలు అమలు చేసిన ఘనత జగనన్నదే అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ప్రజా సంకల్ప యాత్రకు అయిదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం జీవీఎంసీ 39వ వార్డులో మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ సంకల్ప యాత్రలో అందరి సమస్యలు తెలుసుకుని నవరత్నాల పేరుతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారన్నారు. 2024 ఎన్నికల్లో జగనన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ. 20 వేల విరాళం


అన్నదానం కోసం రూ. 20 వేలు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

మహారాణిపేట : ఫిషింగ్ హార్బర్‌లోని గంగాదేవి ఆలయం వద్ద అయ్యప్ప శబరి పీఠంలో కొలువుదీరిన అయ్యప్ప స్వామిని మంగళవారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ దర్శించుకున్నారు. మండల దీక్షతో పాటు కొనసాగిస్తున్న నిత్య అన్నదానానికి రూ. 20 వేలు విరాళంగా అందజేశారు. ముందుగా స్వాములు అయ్యప్పకు హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప స్వామికి వాసుపల్లి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా అయ్యప్ప శబరిపీఠం ఆధ్వర్యంలో మండల దీక్ష పూజలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. మాల ధరించిన భక్తులకు నిత్యాన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్వాములు, అమ్మోరు, చిట్టి, అపోజి, శివ సత్తిరాజు, కొండబాబు, కింగ్ ఫిషర్ రాజు తదితరులు పాల్గొన్నారు.